క్లుప్తంగా

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పరిశీలన



బాల్కొండ: జలాల్‌పూర్‌లో ఇందిరమ్మ లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లను బుధవారం హౌజింగ్ పీడీ ప్రభు పరిశీలించారు. ఇంటి నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంటి నిర్మాణ ప్రకారం డబ్బులు ఖాతాలో జమ చేస్తామన్నారు. ఆయన వెంట డీఈ నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, దేవేందర్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఆర్మూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నిబంధనలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరిస్తూ ఆర్మూర్ మున్సిపల్ సిబ్బంది బుధవారం సర్వే నిర్వహించారు. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని 30వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఆర్థిక స్థితిగతులపై సర్వే నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో బసవేశ్వర జయంతి



రుద్రూర్: గహని గుట్టలో స్వయం భూ బసవేశ్వర స్వామి జయంతిని బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు పరమేశ్వర మహరాజ్, వర్ని ఉమ్మడి మండల మాజీ ఏఎంసీ చైర్మన్ నారాయణ రావ్, గంగాధర్ దేశాయ్, లింగం, శివరాం పాల్గొన్నారు.

కొల్లూర్‌లో..



రుద్రూర్: పొతంగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం మహాత్మ బసవేశ్వర జయంతిని నిర్వహించారు. మహాత్మ బసవేశ్వర విగ్రహాలు, చిత్రపటాల వద్ద పూజలు చేపట్టారు. సమాజంలో కుల, మత బేధాలు లేవని, అందరు సమానమేనని చాటి చెప్పిన మహనీయుడు బసవేశ్వరుడని గుర్తు చేశారు. వీరశైవ లింగాయత్ సభ్యులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో ఉపాధిహామీ కూలీలకు స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఉదయం తొందరగా వచ్చి ఎండ తీవ్రత ఎక్కువ కాకముందే పనులు ముగించుకొని వడదెబ్బ తగులకుండా రక్షించుకోవాలని కూలీలకు సూచించారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడాల మోహన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టక్కర్ గంగాధర్, లింగేశ్వర్, బుల్లెట్ రమేశ్, సీహెచ్ మోహన్, కుర్మ రాజేందర్, అలీమొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

నందిపేటలో మేడే ఉత్సవాలు



నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. కూలీల మధ్యన మేడే సంబరాలు జరుపుతూ మేడే ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధి కూలీలకు పని దినాలను పెంచుతూ అన్ని వసతులను కల్పించాలని కోరారు. ఏపీఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు కె.గంగాధర్, సుదర్శన్, సుమన్, సిద్దాపూర్, గంగామణి దేవారం తదితరులున్నారు

ఆలయ వార్షికోత్సవం



నందిపేట్ (ఆర్మూర్): కుద్వాన్పూర్‌లో మంగళవారం కోదండపురం శ్రీలక్ష్మి అండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ ఊరేగింపు, కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, నాయకులు దేగం గంగారెడ్డి, మరంపల్లి లిఫ్ట్ చైర్మన్ భోజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ప్రభుత్వ విద్యార్థులు

డొంకేశ్వర్‌లో నూరు శాతం ఉత్తీర్ణత



582, డి. వైశాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): పదవ తరగతి ఫలితాల్లో డొంకేశ్వర్ మండలానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. మండలంలో ఐదు ప్రభుత్వ, ఒక ప్రయివేటు ఉన్నత పాఠశాలు ఉండగా పదవ తరగతి విద్యార్థులు మొత్తం 176 మంది పరీక్ష రాశారు. పరీక్ష రాసిన వారంతా పాసైనట్లు ఎంఈవో రామకృష్ణ తెలిపారు. డొంకేశ్వర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన తోట రక్షిత 586 మార్కులతో జిల్లాలోని ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలల్లోనే మొదటి ర్యాంకు సాధించింది. అలాగే డి. వైశాలి 582 మార్కులతో రెండో స్థానంలో నిలిచింది. మండలంలో నూరు శాతం ఫలితాలు రాబట్టేందుకు కృషి చేసిన హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ఎంఈవో అభినందించారు.

మాక్లూర్‌లో 99 శాతం..

మాక్లూర్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మాక్లూర్ మండల వ్యాప్తంగా 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన మొత్తం 312 మంది బాలురు, 332 మంది బాలికలు మొత్తం 644 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు వ్రాశారు. 99 శాతం ఉత్తీర్ణత వచ్చింది. మదన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన అలేఖ్య 577 మార్కులు సాధించారు.

రెంజల్‌లో 98.87 శాతం..

రెంజల్(బోధన్): పది ఫలితాల్లో రెంజల్‌లోని మైనార్టీ గురుకుల విద్యాలయానికి చెందిన అయేషా జబీన్ 569 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. మండలంలో 445 మంది పరీక్షలు రాయగా 440 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 98.87 శాతం ఫలితాలు వచ్చాయని ఎంఈవో ఆంజనేయులు తెలిపారు.

సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో 93 శాతం..

బోధన్: సాలూర మండల కేంద్రంలోని పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో 93 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 46 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, ఇందులో 43 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల విద్యార్థి అక్షయ్ 553 మార్కులు సాధించి ప్రతిభ చాటారు.

కమ్మర్‌పల్లి మండలంలో 98.8 శాతం..

కమ్మర్‌పల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల వ్యాప్తంగా 98.8 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 355 పరీక్షలు రాయగా 351 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు.

ఎడపల్లిలో 96.5 శాతం..

ఎడపల్లి(బోధన్): మండలంలో 403 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 389 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 96.52 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.



ఆలూరు మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈవో నరేందర్

వేల్పూర్ మండలంలో 93.08 శాతం..

వేల్పూర్: మండలంలో 99.73 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండలంలో అన్ని హైస్కూళ్ల నుంచి 376 మంది ఎస్సెస్సీ పరీక్షలు రాయగా 350 మంది ఉత్తీర్ణులయ్యారు.

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికల)లో 47 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా 47 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ కె. పద్మజ తెలిపారు.

మోర్తాడ్‌లో ఒక్కరే ఫెయిల్..

మోర్తాడ్: మోర్తాడ్ మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో తమ ప్రతిభను కనబరిచారు. 364 మంది విద్యార్థులకు 363 మంది ఉత్తీర్ణులై రికార్డు నెలకొల్పారు. ఒక్క విద్యార్థి రెండు సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యాడు. మహాత్మ జ్యోతిబాపూలే, కస్తూర్బా పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో వందకు వంద శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులు తమ ప్రతిభతో మోర్తాడ్ మండలానికి వన్నె తెచ్చారని మండల విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డి తెలిపారు.



557, శివాని

రుద్రూర్: ఈ ఏడాది పదవ తరగతిలో ప్రైవేటు స్కూళ్లతో పోటీ పడి ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించాయి. నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని రుద్రూర్, వర్ని, కోటగిరి, పోతంగల్, చందూర్, మోస్రా మండలాల్లో అత్యుత్తమ ఫలితాలు వచ్చాయి. రుద్రూర్ కేజీబీవీ విద్యార్థిని జి. శివాని 577 మార్కులు సాధించి ఆరు మండలాల్లో టాపర్‌గా నిలిచింది. రుద్రూర్ మండలంలో మూడు, పోతంగల్‌లో మూడు, వర్నిలో మూడు, మోస్రాలో రెండు ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాయి. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను ఎంఈవోలు, స్థానిక నాయకులు అభినందించారు.

ఆర్మూర్, ఆలూర్ పరిధిలో..



581, రాస రక్షిత

పెర్కిట్(ఆర్మూర్): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆర్మూర్‌తో పాటు ఆలూర్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. పెర్కిట్ మోడల్ స్కూల్‌కు చెందిన రాస రష్మిత 581 మార్కులు సాధించింది. ఆర్మూర్ మండలంలో 17 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా 8 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఆలూర్ మండలంలో ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా ఏడు పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.

బోధన్‌లో 95 శాతం..

బోధన్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో బోధన్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు బోధన్ ఎంఈవో నాగయ్య తెలిపారు. 8 ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 320 విద్యార్థులు పరీక్షలు రాయగా 304 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

సాలూరలో 93 శాతం ఉత్తీర్ణత

బోధన్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో సాలూర మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 93 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మంజూష తెలిపారు. మండలంలో మొత్తం 2 ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 91 విద్యార్థులు పరీక్షలు రాయగా 85 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.



582, మైథిలి



574, దినేష్

బాల్కొండ: పదవ తరగతి ఫలితాల్లో బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. బాల్కొండ మండలంలో మొ త్తం మంది విద్యార్థులు 250 మంది పరీక్ష రాయగా 247 మంది, ముప్కాల్ మండలంలో 125 మందికి 124 మంది, మెండోరా మండలంలో 92 మందికి 89 మంది , గురుకులాల్లో 213 మందికి 213 మంది విద్యార్థులు ఉతీర్ణత సాధించారు. బాల్కొండ ప్రభుత్వ పాఠశాలలో కోలా దినేష్ 574 మార్కులు, ముప్కాల్ ఉన్నత పాఠశాల విద్యార్థి సాయి మైథిలి 582 మార్కులు, మెండోరా మండలం వెల్కటూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి నేముల రిశ్వంత్ 544 మార్కులతో టాపర్లుగా నిలిచారు. వీరిని ఎఈవోలు రాజేశ్వర్, రవి, శ్రీనివాస్‌లు అభినందించారు.

'సాలూర ప్రజ్ఞశ్రీ'..



చరణ్ తేజ(582)



ప్రసాద్(570)

బోధన్: సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులతో విజయకేతనం ఎగురవేశారు. చరణ్‌తేజ(582), బస్వ ప్రసాద్ (570), వైష్ణవి(569), మధురిమ(566) అత్యధిక మార్కులు సాధించారని, మొత్తం 81 మంది విద్యార్థులకుగాను 81 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని పాఠశాల కరస్పాండెంట్ లతారాజు తెలిపారు.

సత్తా చాటిన కృష్ణవేణి విద్యార్థులు..

బాల్కొండ: మండల కేంద్రంలో కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. 83 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 83 మంది ఉతీర్ణత సాధించారు. మండల టాపర్‌గా ఈ పాఠశాల విద్యార్థి 579 మార్కులతో బండారి స్మిత నిలిచింది.

బోధన్‌లో ప్రైవేటు విద్యార్థుల ప్రతిభ

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో బోధన్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చాటారు. వివరాలు.. బోధన్‌టౌన్(బోధన్)

వికసించిన ఇందూర్..



టి.సంజన(588)



ఐశ్వర్య(582)



సంజన(572)



కీర్తన(567)

పట్టణంలోని అచన్‌పల్లిలో గల ఇందూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు టి.సంజన(588), ఎం.ఐశ్వర్య(582), జె. సంజన(572), కీర్తన(567)మార్కులు సాధించి ప్రతిభను చాటారు. 500 మార్కులకుపైగా 121 మంది విద్యార్థులు సాధించి సత్తా చాటారని పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిశోర్ తెలిపారు.

విజయసాయి విజయకేతనం



శ్రీనిధి(584)



ప్రతిక్ భగత్(584)



వైభవి(583)



హిఫ్రాఫాతీమా(583)

విజయ సాయి స్కూల్ విద్యార్థులు పి. శ్రీనిధి, ప్రతిక్ భగత్(584), ఎం. వైభవి, మిఫ్రా ఫాతీమా, కె. కౌశిక్ కళ్యాణ్(583) మార్కులు వచ్చాయని, 580కి పైగా మార్కులు ఆరుగురు విద్యార్థులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ తెలిపారు.

ప్రజ్ఞ ప్రభంజనం



తిరున్ రెడ్డి(581)



సందీప్(577)



వినీల(571)



అర్జున్(565)

పట్టణంలోని ప్రజ్ఞ హైస్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రతిభను చాటారు. కె.తిరున్ రెడ్డి(581),బి. సందీప్(577), ఎస్. వినీల(571), జె. అర్జున్(565) మార్కులు సాధించి ప్రతిభ చాటారు. మరో తొమ్మిది మంది విద్యార్థులు 560కి పైగా మార్కులు సాధించి సత్తా చాటారని పాఠశాల కరస్పాండెంట్ సోము చౌడారెడ్డి తెలిపారు.

మెరిసిన మాతృశ్రీ ..



రితిక(585)



సాత్విక్(584)



శ్రావ్య(581)



మేధశ్రీ(579)

బి.రితిక(585), జె. సాత్విక్(584),ఎం. శ్రావ్య(581), ఇ. మేధశ్రీ(579), గణేష్ కుమార్(576), అంజుశ్రీ(577), దానియా రకీబ్(576), జరీన్ ఫాతిమా(572), అత్యధిక మార్కులు సాధించారు. 84 మంది 500 మార్కులకు పైగా సాధించారని మాతృశ్రీ పాఠశాల కరస్పాండెట్ సిరిగిరి దిగంబర్ రావు అన్నారు.

మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు

- ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి వెల్లడి

బోధన్: నియోజకవర్గానికి మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని నీటిపారుదల శాఖ విశ్రాంతి భవనంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. బోధన్ పట్టణ శివారు ఆచన్‌పల్లిలో సబ్ స్టేషన్‌కు రూ.2 కోట్ల 21 లక్షలు, సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ సబ్ స్టేషన్‌కు రూ.కోటి 99 లక్షలు, నవీపేట మండలంలోని హనుమాన్‌ఫారం-గాంధీనగర్ సబ్‌స్టేషన్‌కు రూ.2 కోట్ల 23 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇసుక, మొరం ఎక్కడా అందుబాటులో ఉన్నా ఇళ్ల లబ్ధిదారులు తెచ్చుకునేందుకు అధికారులు అనుమతులు ఇస్తారని వివరించారు. సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేను జాడిజమాల్‌పూర్ గ్రామస్తులు సన్మానించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము శరత్ రెడ్డి, గంగాశంకర్, దాము, పులి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జాడిజమాల్‌పూర్ రైతులు

'రైతు భరోసా' ఇప్పించాలి

కమ్మర్‌పల్లి: మండల కేంద్రం పరిధిలోని సర్వే నంబర్-386లో పట్టా ఉన్న రైతులకు 'రైతు భరోసా' ఇప్పించాలని కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులును కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వినతి పత్రం అందజేశారు. 386 సర్వే నంబర్ అసైన్డ్ భూమి కాగా.. 1168 ఎకరాలు ఉంది. ఇందులో 359 మంది రైతులకు 322.01 ఎకరాలకు పట్టా పాస్‌బుక్‌లు జారీ అయ్యాయి. ఈ సర్వే నంబర్‌ను ఆరు నెలల క్రితం ప్రభుత్వం వ్యవసాయ యోగ్యం కాని భూమిగా రికార్డుల్లో నమోదు చేసింది. దీంతో పట్టా పాస్‌బుక్ ఉన్న రైతులకు రైతు భరోసాకు అనర్హులయ్యారు. కొంతమంది రైతులు తాము సాగు చేస్తున్నామని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతు భరోసా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

గొప్ప మానవతావాది బసవేశ్వరుడు

బోధన్: మనుషులంతా ఒక్కటేనని చాటి చెప్పి సామాజిక న్యాయం కోసం, కుల, మూఢ నమ్మకాలు, దురాచాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరశైవ లింగాయత్ ధర్మ వ్యవస్థాపకులు బసవేశ్వరుడు గొప్ప మానవతావాదని వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్ ప్రతినిధులు అన్నారు. బుధవారం సాలూర మండల కేంద్రంలో వీరశైవ లింగాయత్ సమాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా బసవేశ్వరుడి జయంతిని వైభవంగా నిర్వహించారు. బసవేశ్వరుడి విగ్రహానికి సమాజ్ అధ్యక్షుడు శివపూజ శంకర్, ప్రతినిధులు పూజలు చేశారు. విగ్రహం ఎదుట కాషాయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా సమాజ్ ప్రతినిధులు మాట్లాడారు.

అధికారికంగా బసవేశ్వరుడి జయంతి..

బోధన్ సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో బుధవారం అధికారికంగా మహాత్మా బసవేశ్వరుడి జయంతిని నిర్వహించారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో బసవేశ్వరుడి చిత్రపటానికి పూజలు చేశారు. వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్ జిల్లా ప్రతినిధులు వీఆర్‌దేశాయ్, అజయ్ కుమార్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బోధన్ సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో బసవేశ్వరుడి జయంతి నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్, తదితరులు

కాంగ్రెస్.. రైతుల ఇంట కష్టాల మంట పెట్టింది

- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్: పండించిన పంటలు కొనుగోలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఇంట కష్టాల మంట పెట్టిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి మండిపడ్డారు. ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వరకు 27 కిలో మీటర్ల పొడవునా రోడ్డుపై కుప్పలుగా పోసి ఉన్న ధాన్యం రాసులను బుధవారం తెల్లవారుజామున ఆయన పరిశీలించారు. పంటను కొనే వారు లేక రోజుల తరబడి పడిగాపులుగాస్తున్న రైతులను ఓదార్చారు. సర్కార్‌పై ఒత్తిడి తెచ్చి చివరి గింజ కొనేవరకు పోరాడదామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వరకు రోడ్డుపై ధాన్యం పెట్టుకొని కొనే దిక్కులేక దిగాలు చెందుతున్న రైతులను చూసి గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల భయం అన్నదాతలను భయపెడుతోందన్నారు. అకాల వర్షాలు పడి ధాన్యం తడిస్తే రైతులకు మూడు రెట్లు అధికంగా పరిహారం చెల్లించే బాధ్యత సర్కార్‌దేనని గుర్తు చేశారు. రైతులకు నష్టం జరిగితే ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బాధ్యత వహించాలన్నారు.



వరి కుప్పలను పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

రాజ్యాధికారంతోనే దళితుల సమస్యలు పరిష్కారం

- డీ జేఏసీ చైర్మన్ గాలి వినోద్ కుమార్
- బోధన్‌లో మహనీయుల జయంత్యోత్సవ సభ

బోధన్: డాక్టర్ అంబేద్కర్ ఆలోచన, ఆకాంక్షలు సాధించుకునేందుకు ఆయన వారసులంతా చైతన్యవంతులు కావాలని హైదరాబాద్‌కు చెందిన డీ జేఏసీ చైర్మన్, మాజీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా తెలంగాణ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. దళితులు కలిసి కట్టుగా ముందుకెళ్తే ఏ రాజకీయ శక్తులు, వ్యక్తులు అడ్డుకోలేవన్నారు. రాజ్యాధికారంతోనే దళితుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో దళితుడే సీఎం కావాలన్నారు. డాక్టర్ అంబేద్కర్, జ్యోతిబా పూలే, బాబూ జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ఎస్సీ,ఎస్టీ హక్కుల పరిరక్షణ డివిజన్ కమిటీ అధ్వర్యంలో బుధవారం రాత్రి బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మహనీయుల జయంత్యోత్సవ భారీ సభను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, దళితసేన జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేబీ రాజు హాజరయ్యారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రవాదుల కాల్పులో చనిపోయినవారికి మౌనం పాటించి నివాళులర్పించారు. సమావేశానికి ముందు పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సభలో ప్రముఖ బహుజన గాయకుడు గజ్జెల అశోక్ కళాబృందం నిర్వ హించిన ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ఎస్సీ,ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ డివిజన్ కన్వీనర్ సీనియర్ న్యాయవాది నీరడి ఈశ్వర్ సభకు అధ్యక్షత వహించారు. ప్రతినిధులు పరిమికోటేశ్వర్‌రావు, నీరడి రవి,గ్రావణ్, కారం స్వామి,బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సింగారే పాండు, వివిధ సంఘాల నాయకులు, జిల్లా ప్రతినిధులు వివిధ మండలాల ప్రజలు పాల్గొన్నారు.



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అతిథులు, కమిటీ ప్రతినిధులు

మారోజు సుధాకర్‌చారికి అరుదైన గౌరవం



బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మారోజు సుధాకర్‌చారికి అరుదైన గౌరవం లభించింది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నింగి, నేల మేము సైతం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మల్లారెడ్డి గార్డెన్‌లో శ్రీకాంతచారి మెమోరియల్ అవార్డును శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, నిర్వాహకులు దరువు అంజన్న చేతుల మీదుగా అందుకున్నారు. సుధాకర్‌చారికి పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	ఏఎల్‌సీసీ(ఓ యూనివర్సల్ బ్యాచిలర్)- 11.00, అర్జున్ సన్నాఫ్ వైజయంతి-1.35, 7.25, చోరరా-4.35, సూర్యాపేట జంక్షన్-10.25
స్క్రీన్-2	మన ఇద్దరి ప్రేమకథ-10.50, నె జహా-2 (తెలుగు)-1.15, 4.20.7.20,తుడరుమ్ -10.20
స్క్రీన్-3	సారంగపాణి జాతకం-11.10, 2.00, 4.50, 7.40, 10.30
స్క్రీన్-4	జింఖానా-11.30, 7.35, 10.30, చౌర్య పాఠం-2.25, శివ శంభో-5.05



మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,000	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	90,465		

- నిజామాబాద్ బిజినెస్